సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం, 19, డిసెంబర్, 2024



ఒక్కొక్కరిని కబళిస్తోంది...

కిడ్నీ వ్యాధితో అనంతారం గ్రామస్తులు అల్లాడుతున్నారు. కొందరు మృతి చెందగా, మరికొందరు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. 8లో



..సమస్యలు పరిష్కరించాలి

సింగరేణిలోని వివిధ శాఖల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పర్సనల్ విభాగం జీఎం కవితా నాయుడు ఆదేశించారు. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజనం జరిపించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

4,264 గ్రామీణ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

చుంచుపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని 479 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురించినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం వార్డుల సంఖ్య 4,232 కాగా గ్రామీణ ప్రాంతాల్లో 4,264 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గ్రామీణ ఓటర్లు 6,33,947 మంది ఉండగా పురుషులు 3,08,492, మహిళలు 3,25,431, ఇతరులు 24 మంది ఉన్నారని వివరించారు. 200 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 3,528, 201–400 ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు 595, 401–650 ఓటర్లు వరకు ఉన్న కేంద్రాలు 141 చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వేగంగా ఇంటింటి సర్వే

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేశామని డీపీఓ చంద్రమౌళి తెలిపారు. ఇల్లెందులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రజాపాలన సభల సందర్భంగా 2,73,493 మంది ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 33 వేల దరఖాస్తులను సర్వే చేశామన్నారు. కొన్ని గ్రామాల్లో సిగ్నల్ సమస్యతో జాప్యం జరుగుతోందని, అక్కడ ఆఫ్‌లైన్‌లో సర్వే చేసేలా ప్రత్యామ్నాయ యాప్ సిద్ధం చేశామని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు నేరుగా ప్రభుత్వమే చెల్లించేలా ప్రణాళిక రూపొందించిందని, జిల్లాలోని కార్మికుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని అన్నారు. జీఓ.51 ప్రకారం 500 జనాభాకు ఒక కార్మికుడు చొప్పున మాత్రమే ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుందని, అదనంగా నియమించిన వారికి పంచాయతీలే డైలీ లేబర్ పేరిట వేతనాలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎంపీడీవో ధన్‌సింగ్, డీఎల్‌పీవో రమణ, ఎంపీవో చిరంజీవి పాల్గొన్నారు.

మళ్లీ వచ్చిన పెద్దపులి !

ధ్రువీకరించిన ఫారెస్ట్ డివిజన్ అధికారి



దప్పు చాటింపు వేయిస్తున్న అటవీ అధికారులు

కరకగూడెం: మండలంలోని రఘునాథపాలెం గ్రామ అటవీ ప్రాంతంలో వారం రోజుల క్రితం పెద్దపులి అడుగు జాడలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. రెండు రోజుల క్రితం ములుగు జిల్లా తాడ్వాయి మండలం నర్సాపురం, పంబాపురం అటవీ ప్రాంతాల్లోకి వెళ్లినట్లు వెల్లడించారు. కాగా, బుధవారం రఘునాథపాలెం గ్రామానికి చెందిన కొమరం నర్సయ్య అనే రైతు మేకలను మేపేందుకు గ్రామ సమీపంలోని అడవికి వెళ్లగా.. పాలఒర్రె వద్ద మేకతో పాటు వెంట తీసుకెళ్లిన కుక్కలు కూడా బెదురుతూ పరుగుతీశాయి. ఈలోగా పులి గాండ్రిపు వినిపించడంతో నర్సయ్య గ్రామానికి పరుగెత్తుకుంటూ వచ్చి స్థానికులతో పాటు అటవీ అధికారులకు తెలిపాడు. దీంతో అటవీ అధికారులు చేరుకుని.. అడవిలోకి ఎవరూ వెళ్లొద్దంటూ డప్పు చాటింపు వేయించారు. ఈ విషయమై 'సాక్షి' మణుగూరు ఎఫ్‌డీఓ మక్సుద్ మొహినొద్దీన్‌ను వివరణ కోరగా పెద్దపులి వచ్చిన విషయం వాస్తవమేనని ధ్రువీకరించారు.

64 మందికి కంటి శస్త్ర చికిత్సలు


మణుగూరు టౌన్: సింగరేణి ఆధ్వర్యంలో బుధవారం 64 మందికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి కళ్లజోళ్లు అందించారు. ఈ సందర్భంగా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. పరిసర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాల ద్వారా రామానుజవరం, తిర్లాపురం, బెస్తగూడెం గ్రామాల్లో 130 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వారిలో మొదటి విడతలో 64 మందిని సికింద్రాబాద్ ఆస్పత్రికి తరలించామని, ఆపరేషన్లు చేయించి రూ.1.25 లక్షల విలువైన కళ్లజోళ్లు అందించామని తెలిపారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి, పీఓ శ్రీనివాసాచారి, డీవైసీఎంఓ మేరీకుమారి, టి.సురేశ్, శేషగిరి, అవినాష్, సింగు శ్రీనివాస్, షాకిరా పాల్గొన్నారు.

చలితో జాగ్రత్త..

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కుర్నవల్లిలో 9 డిగ్రీల కనిష్ట స్థాయిలో నమోదు
- అప్రమత్తంగా లేకుంటే అనారోగ్యం కొనితెచ్చుకున్నట్లే..

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతల్లోనూ గణనీయమైన మార్పు వస్తోంది. నిన్నామొన్నటి వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలుగా నమోదు కాగా బుధవారం తల్లాడ మండలం కుర్నవల్లిలో 9 డిగ్రీలకు పడిపోయింది. దీంతో చలి కారణంగా పిల్లలు, వృద్ధులతోపాటు అన్ని వయసుల వారూ వణికిపోతున్నారు. రాత్రి వేళ బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఉదయం 9గంటల వరకు కూడా మంచు తెరలు వీడకపోవడంతో జనసంచారం పలుచగా ఉంటోంది. కామేపల్లిలో సోమవారం 10.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మంగళవారం 16 డిగ్రీలుగా ఉంది. ఈ నేపథ్యాన ఆరోగ్యం, ఆహారం విషయాల్లోనే కాక పంటలు, పెంపుడు జంతువుల అంశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనదారులు పాటించాల్సిన రక్షణ చర్యలపై ప్రత్యేక కథనాలు..

చిన్నాపెద్దలు అంతా భద్రం..



భద్రాచలం అర్బన్: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి చేరుతూ చలి విజృంభిస్తోంది. ఉదయం, సాయంత్రం ఇదే పరిస్థితి ఉండగా మధ్యాహ్నం సైతం చలిగాలులు వీస్తుండడంతో పిల్లలు, పెద్దవారు ఆస్తమా(ఉబ్బసం), అలెర్జిక్ రైనైటిస్, సైనసైటిస్ వంటి శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. కొందరిలో ఇది ప్రాణాంతకం కాకపోయినా తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ మేరకు వ్యాధుల లక్షణాలు, జాగ్రత్తలపై భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. చలికాలంలో ఊపిరి ఆడకపోవడం, పిల్లికూతలు, ఛాతి పట్టేయడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాగే, దగ్గు, కఫం, జలుబు, ముక్కుకారడం, కళ్లమంటలు, ముక్కులు పట్టేయడం, గొంతు నొప్పి, జ్వరం, ఒళ్లునొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాలతో బాధపడుతుంటారు. వీటి బారిన పడకుండా చల్లగాలికి బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. తప్పనిసరి వెళ్లాల్సి వస్తే ముఖానికి చలిగాలి తగలకుండా వస్త్రాలు కట్టుకోవడమో లేదా మాస్క్ ధరించడంతో పాటు చెవుల్లో దూది పెట్టుకోవాలి. గుండె జబ్బులు ఉన్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్న వారు చలిలో వాకింగ్ చేయొద్దు. బీపీ, షుగర్ ఉన్న వారు కూడా జాగ్రత్తలు పాటించాలి. ఎప్పుడూ గోరువెచ్చని నీటినే తాగాలి. తీసుకునే ఆహారం వేడిగా ఉండాలి. చల్లటి పానీయాలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ వంటి వాటికి జోలికెళ్లొద్దు. జలుబు చేసిన వారు వేడి నీటిలో చిటికెడు ఉప్పు వేసి రోజుకు రెండు మూడుసార్లు పుక్కిలించాలి. సహజంగా దొరికే పసుపు వేడినీటిలో వేసి ఆవిరిపట్టడం వంటివి చేసినా ఫలితం ఉంటుంది. మిరియాలు, ఎండు అల్లంతో చేసిన ద్రావణాన్ని రోజులో ఒకసారైనా తాగాలి. రెండు లేదా మూడురోజులపాటు ఎవరైనా ఆయాసం, దగ్గు, కఫంతో బాధపడుతున్నట్లయితే వెంటనే సమీపంలోని శ్వాసకోశ సంబంధిత నిపుణులను సంప్రదించి వైద్యం పొందాలి.



డాక్టర్ రామకృష్ణ

మేలు చేసేవే తినండి..



ఖమ్మంవన్‌టౌన్: చలిగాలుల నేపథ్యాన ఏం తింటే ఏమవుతుందోన్న ఆందోళన అందరినీ వెంటాడుతుంటుంది. ఇతర కారణాలతో అనారోగ్యం ఎదురైనా తీసుకునే ఆహారం ప్రభావమే కావొచ్చని భావిస్తుంటారు. ఈమేరకు చలి పెరుగుతున్న వేళ ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఏం తినొద్దనే అంశంపై ఖమ్మంకు చెందిన డాక్టర్ మీనా మురారి (బీడీఎస్, ఎంబీడీఏ – డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ న్యూట్రీషియన్) తెలిపిన వివరాలు... చలికాలంలో ఆకుకూరలు తినాలి. తద్వారా వాటిలోని యాంటీ ఆక్సీడెంట్లు, విటమిన్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా పాలకూరలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది తినడం వలన హిమోగ్లోబిన్ పెరుగుతుంది. చలికాలంలో నెయ్యి తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యితో రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, దగ్గు వంటి సమస్యలు దరిచేరవు. అలాగే, డ్రై ఫ్రూట్స్, నట్స్ తీసుకుంటే అందులోని ప్రోటీన్లు, ఆమైనో యాసిడ్స్ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. క్యారెట్, ఉల్లిపాయలు, బచ్చలికూర, పచ్చి బటానీలు, ఉసిరికాయలు తినాలి. ఇవి బీటాకెరోటిన్, విటమిన్ సీ వంటి పోషకాలు కలిగి ఉంటాయి. వీటితో పాటు పప్పులు, కూరగాయలు సూప్స్‌లా చేసుకుని తీసుకోవడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. పాలల్లో పసుపు, మిరియాలు, సొంటి మరిగించి ప్రతీరోజు తాగాలి. అలా చేసిన పాలను గోల్డెన్ మిల్క్ అంటారు. వయసు మీద పడినవారు టీ, కాఫీలకు బదులు హెర్బల్ టీ, అల్లం, తులసి ఆకులతో చేసిన టీ తాగితే మంచిది. వేరుశనగలు ఉడకబెట్టి కానీ, వేయించుకుని తింటే మంచిది. అందులో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. జామకాయలో ఉండే సీ విటమిన్ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. ఇకపోతే స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండాలి. ఎప్పటికప్పుడు వేడివేడి ఆహారం తినడం మరింత మంచిది.



డాక్టర్ మీనా మురారి

రెవెన్యూ దక్కేనా..?



మణుగూరు, ఇల్లెందు పట్టణాల వ్యూ..

మళ్లీ తెరపైకి కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు

- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి పొంగులేటి
- పెండింగ్‌లో మణుగూరు, ఇల్లెందు కేంద్రాలు
- మూడు కొత్త మండలాలు కావాలంటున్న ప్రజాప్రతినిధులు
- మూడున్నరేళ్ల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, నూతన మండలాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై చర్చిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి.

మూడున్నరేళ్ల క్రితమే ప్రతిపాదనలు..

జిల్లాలో ఇల్లెందు, మణుగూరు కేంద్రాలుగా కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని మూడున్నరేళ్ల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినా నేటికీ పరిశీలన దశలోనే మగ్గుతున్నాయి. భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో భద్రాచలం, పినపాక నియోజకవర్గాలు ఉన్నాయి. గోదావరికి ఇరువైపులా ఉన్న మండలాలు ప్రస్తుతం భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. దీంతో నదికి ఎడమ వైపు ఉన్న ప్రాంతాన్ని భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఉంచి కుడి వైపు ఉన్న ప్రాంతాలను కలుపుతూ మణుగూరు కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. జనాభా ఎక్కువగా ఉన్న కొత్తగూడెం డివిజన్‌ను విభజించి ఇల్లెందుకు రెవెన్యూ డివిజన్ హోదా కల్పించాలని గతంలోనే అప్పటి ఎమ్మెల్యే హరిప్రియనాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపైనే కమ్యూనిస్టు పార్టీలు సైతం పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

సులభంగా.. వేగంగా..

జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువ కావడంతో పాటు పరిశ్రమలూ విస్తరించి ఉన్నాయి. సీతారామ వంటి బహుళార్థ సాధక సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది. వందల ఏళ్ల నుంచి సింగరేణి సంస్థ జిల్లాలో బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. ఇటీవల జాతీయ రహదారులు, కొత్త రైల్వేలైన్లు కూడా మంజూరయ్యాయి. దీంతో వివిధ అభివృద్ధి పనుల కోసం తరచూ భూసేకరణ చేయాల్సి వస్తుంది. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటైతే పరిపాలన మరింత వేగంగా, సులభంగా అందించే వీలు కలుగుతుంది.

కొత్త మండలాలు వచ్చేనా..

ఇల్లెందు మండల పరిధిలో ఉన్న కొమరారం, టేకులపల్లి మండల పరిధిలోని బోడు, అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంటలను కొత్త మండల కేంద్రాలుగా ప్రకటించాలని గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ మేరకు మండలాలను ఎలా విభజించాలనే అంశంపై ప్రాథమిక నివేదికలు సిద్ధమయ్యాయి. అయితే ఈ వ్యవహారం కాగితాలను దాటి కార్యరూపం దిశగా ముందుకు సాగడం లేదు.

ఏజెన్సీలో వెసులుబాటు..

జనాభా తక్కువగా ఉండడం, సరిపడా ఎంపీటీసీ స్థానాలు లేకపోవడంతో కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు సాధ్యం కావడం లేదని అధికారులు అంటున్నారు. అయితే రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే విస్తీర్ణం పరంగా భద్రాద్రి జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. అడవులు, కొండ ప్రాంతాలు, గిరిజన జనాభా ఎక్కువ. ఏజెన్సీ ప్రాంతాల్లో జనాభా సంఖ్యతో సంబంధం లేకుండా కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు ఏర్పాటు చేసే వెలుసుబాటు ఉంది. అప్పుడే పరిపాలన వెనుకబడిన ప్రాంతాలకు సులభంగా చేరువవుతుందనే వాదనలు ఉన్నాయి.

పొంగులేటి దృష్టి సారిస్తే..

గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ డివిజన్లు, మండలాల విషయంలో హామీలే తప్ప ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత రాష్ట్ర కేబినెట్‌లో రెవెన్యూ శాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉన్నారు. పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య పొంగులేటి వెంటే తమ రాజకీయ ప్రయాణం సాగిస్తున్నారు. కనీసం ఇప్పుడైనా కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ల అంశాన్ని వీరిద్దరూ పొంగులేటి దృష్టికి తీసుకెళ్లాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కొండరెడ్లకు మౌలిక వసతులు

ఐటీడీఏ పీఓ రాహుల్



భద్రాచలం : అధికారులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: కొండరెడ్లకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో ఉద్యాన, వ్యవసాయ, విద్యుత్, అటవీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూసుకుంట గ్రామంలో నివసిస్తున్న కొండరెడ్ల గిరిజనులకు మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా విద్యుత్, రోడ్డు, వ్యవసాయానికి సంబంధించిన పనులు త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పూసుగుప్పలో కొండరెడ్ల గిరిజనులకు అందుతున్న మౌలిక వసతులపైనా ఆరా తీశారు. గత వారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ గ్రామంలో పర్యటించిన సందర్భంగా గిరిజనులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ఐటీడీఏ ద్వారా రైతులకు మోటార్లు అందిస్తామని, విద్యుత్ సరఫరాకు 70 శాతం సబ్సిడీ ఉందని, మిగిలిన 30 శాతం ఐటీడీఏ నుంచి చెల్లించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించగానే పామాయిల్ మొక్కలు వేయించాలని, అంతర పంటలుగా జొన్న, కొండజొన్న, బొబ్బర్లు సాగు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. మునగ చెట్లు, ఇతర పండ్ల చెట్లు కూడా వేయించాలన్నారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్ రెడ్డి, ఏడీ వెంకటరత్నం, జిల్లా ఉద్యానవన అధికారి కిషోర్, డీపీఓ బాబూరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

పాల్వంచ: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని పీఓ రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. ఉద్దీపకం వర్క్‌బుక్‌లతో విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలన్నారు. మండలంలోని నాగారం తండా, తోగ్గూడెం జీపీఎస్ పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఉద్దీపకం పాఠ్యాంశాలను బోర్డుపై రాయించి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులు ఇంగ్లిష్, గణితం చదవడం, రాయడంలో వెనుకబడుతున్నందున వారికి అనుకూలంగా ఉండేలా ఈ పుస్తకాలను రూపొందించామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్‌లలో విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో దమ్మపేట ఏటీడీఓ చంద్రమోహన్, పీజీ హెచ్ఎం భద్రు, ఎస్సీఆర్‌పీ హరిలాల్, ఉపాధ్యాయులు సుజాత, పద్మ, రాంబాబు, పుల్లమ్మ పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి..

భద్రాచలంఅర్బన్ : గిరిజన పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పీఓ రాహుల్ అన్నారు. బుధవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రత్యేకాధికారులు, ఏటీడీఓలు, హెచ్ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల చదువు పటిష్టంగా ఉండాలంటే ఒకటి నుంచి ఐదు తరగతుల వారికి ఉద్దీపకం వర్క్‌బుక్‌లో సూచించినట్టుగా బోధన చేయాలని, వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ అమలు చేయాలన్నారు. సమావేశంలో డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏసీఎంఓ రమణయ్య, రాములు, ఏటీడీఓలు జహీరుద్దీన్, సత్యవతి, చంద్రమోహన్, జీసీడీఓ అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

సింగరేణి(కొత్తగూడెం) : కొత్తగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని ఉపాధి కల్పనా శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ సంస్థకు చెందిన కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, సత్తుపల్లి బ్రాంచ్‌ల్లో ఖాళీల భర్తీకి చేపట్టిన జాబ్‌మేళాకు 178 మంది హాజరు కాగా 34 మంది ఎంపికయ్యారని, వారికి నియామక ఉత్తర్వులు అందజేశామని వివరించారు.

నాణ్యమైన భోజనం పెట్టండి

డీఈఓ వెంకటేశ్వరాచారి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈఓ

చండ్రుగొండ : విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సిబ్బందికి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కేజీబీవీలో తయారు చేస్తున్న వంటలను పరిశీలించి, బాలికలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని చెప్పారు. కస్తూర్బా విద్యాలయాల ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో విద్యార్థినుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ సత్యనారాయణ ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌కు స్పందన..

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో పాతకొత్తగూడెంలోని తెలంగాణ పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాలోని 23 మండలాల నుంచి విద్యార్థులు హాజరు కాగా, విజేతలకు డీఈఓ వెంకటేశ్వరాచారి బహుమతులు ప్రదానం చేశారు. అశ్వాపురానికి చెందిన వి.విశాల్ ప్రథమ బహుమతి సాధించగా, టేకులపల్లి పాఠశాల విద్యార్థిని ఎస్.గీత ద్వితీయ బహుమతి గెలుచుకుంది. మూడో బహుమతిని సారపాకకు చెందిన అలివేలు సాధించింది. కాగా, జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో జరుగుతాయని డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ గౌరవాధ్యక్షుడు మాధవరావు, శ్రీనివాసరావు, ఎంఈఓ ప్రభుదయాళ్, ఫోరం అధ్యక్షురాలు సునందిని, జనరల్ సెక్రటరీ విజయభాస్కర్ పాల్గొన్నారు.

పామాయిల్‌తో భూసారం..

దమ్మపేట : పామాయిల్ సాగుతో భూసారం పెరుగుతుందని జిల్లా ఉద్యాన శాఖాధికారి కిషోర్ తెలిపారు. మండలంలోని పూసుకుంటలో పామాయిల్ సాగుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చీడపీడలను తట్టుకోవడమే కాక దొంగలు, జంతువుల బెడద లేని ఏకైక పంట పామాయిల్ అన్నారు. అంతర పంటలుగా మొక్కజొన్న, అరటి, పుచ్చకాయ, వేరుశనగ, మునగతో పాటు శాశ్వత అంతర పంటలుగా కోకో వంటివి సాగు చేయొచ్చని వివరించారు. ఈ పంటలతో అదనపు ఆదాయం వస్తుందని, పామాయిల్ ధర టన్నుకు రూ. 20వేలకు పైగా ఉందని తెలిపారు. 300ఎకరాల్లో పామాయిల్ సాగుకు కొండరెడ్లు ముందుకు రాగా, ఐటీడీఏ నుంచి బోర్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, హెచ్ఓ సందీప్, ఏఈఓ కేశవ, అప్పారావు, సతీష్, నరసింహారావు పాల్గొన్నారు.

నేటి నుంచి 'బెళగావి' రద్దు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ నుంచి సికింద్రాబాద్ వరకు నడిచే బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం నుంచి రద్దు చేస్తున్నట్టు స్థానిక రైల్వే స్టేషన్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ రైలును ఎప్పుడు పునరుద్ధరిస్తామనే అంశంపై ఇంకా స్పష్టత లేదని పేర్కొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

కేఎంసీకి రూ.3.66 కోట్లు మంజూరు

ఖమ్మంమయూరిసెంటర్: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా ఊరటనిచ్చే నిర్ణయం వెలువడింది. గత నెలలో అన్‌టైడ్ గ్రాంట్స్‌ను విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా 15వ ఆర్థిక సంఘం నుంచి టైడ్ గ్రాంట్స్‌ను మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాలిటీలకు ఈ నిధులు విడుదలయ్యాయి. మున్సిపాలిటీల్లో ఈ నిధులను నీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛభారత్ పథకం పనులకు వినియోగించుకోవచ్చు. వ్యర్థాల నిర్వహణకు సైతం వెచ్చించే అవకాశముండడంతో పారిశుద్ధ్యం మెరుగుపడనుంది. కాగా, ఇందులో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు అత్యధికంగా రూ.3కోట్లకు పైగా విడుదల కాగా, మణుగూరు మున్సిపాలిటీకి మాత్రం నిధులు రాలేదు.

నిధుల వివరాలు (రూ.ల్లో)	
ఖమ్మం కార్పొరేషన్	3,66,03,632
పాల్వంచ	1,09,57,689
కొత్తగూడెం	1,00,16,041
మధిర	44,89,053
వైరా	43,90,295
సత్తుపల్లి	43,71,005
ఇల్లెందు	42,95,821

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



పోటీలకు సిద్ధమైన మైదానం

పాల్వంచరూరల్ : మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గురుకుల విద్యాలయాల రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ – 2024కు లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ముస్తాబైంది. పోటీలు గురువారం ప్రారంభమై 20, 21 తేదీల్లోనూ కొనసాగుతాయి. 23 క్రీడాంశాల్లో జరిగే పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జోన్ల నుంచి 1,400 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా గురుకులాల మల్టీ జోనల్ అధికారి అలివేలు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒలింపిక్ స్థాయిలో గురుకుల విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాల్వంచలో రెండో సారి రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. పోటీల విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో జోనల్ అధికారి స్వరూప, ప్రిన్సిపాల్ పి.వి.ఎస్. పాపారావు, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, పీడీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అజొల్లా వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న డీఏఓ బాబూరావు

చుంచుపల్లి: నత్రజని ఎరువు వాడకం తగ్గించేందుకు జీవ ఎరువు అజొల్లా వినియోగించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు తెలిపారు. చుంచుపల్లి రైతు వేదికలో దేశీ నూతన బ్యాచ్‌లో శిక్షణ పొందుతున్న ఇన్‌పుట్ డీలర్లకు బుధవారం ఆయన బ్యాగులు, ఐడీ కార్డులు, శిక్షణా కాలంలో నిర్వహించాల్సిన ఆరు రిజిస్టర్లను పంపిణీ చేశారు. వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ అజొల్లా జీవ ఎరువు గాలిలో ఉన్న నత్రజనిని గ్రహించి పొలంలోని మొక్కలు, పంటలకు అందుబాటులో ఉంచుతుందని, తద్వారా యూరియా ఎరువు వాడకం తగ్గుతుందన్నారు. అనంతరం మునగ సాగు విషయాలు, ఆర్థిక లాభాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్ డేవిడ్ జయపాల్‌రావు, రంజిత్ కుమార్, 40 మంది దేశీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్

కొత్తగూడెంరూరల్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు స్వచ్ఛంద సంస్థలు హైరిస్క్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు(సీఏబీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు మ్యాపింగ్ హైరిస్క్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను జాగృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీనాయక్, జెఎం.స్వర్ణలత లోనినా, ఎం.నాగరాజు, స్వచ్ఛంద సంస్థ మేనేజర్లు రాజేంద్ర ప్రసాద్, నవీన్, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత మున్సిపాలిటీ రోడ్డులో బెల్ట్‌షాపు?



సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన చిత్రం

పాల్వంచ: పట్టణంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డులో ఫారెస్ట్ ఆఫీస్ మూలమలుపు వద్ద ఓ బడ్డీ కొట్టులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగి ఈ మద్యం దుకాణం నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ విధుల్లో ఉండే పోలీస్ ఉద్యోగి సైతం వచ్చి గుట్టుచప్పుడు కాకుండా మద్యం తాగి వెళ్తున్న ఫొటోలు బుధవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బూర్గంపాడు: మండలంలోని సంజీవరెడ్డిపాలెం గ్రామానికి సమీపంలో రోడ్డుపక్కన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడులోని గౌతమిపురం కాలనీకి చెందిన మారబోయిన రమేష్(50) సంజీవరెడ్డిపాలెం గ్రామ సమీపంలో రోడ్డుపక్కన మృతి చెంది ఉన్నాడు. తలకు గాయాలుండటంతో కుటుంబసభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కూలిగా జీవనం సాగిస్తున్న రమేష్ మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం మృతదేహమై కనిపించడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపాడు ఎస్‌ఐ నాగబిక్షం ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య గంగ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ మొక్కలు నరికివేత

అశ్వారావుపేటరూరల్: జామాయిల్ మొక్కలను ఇద్దరు వ్యక్తులు నరికివేసి ధ్వంసం చేసిన ఘటన మండలంలో జరిగింది. బాధిత రైతు కథనం ప్రకారం.. వినాయకపురం గ్రామానికి చెందిన మొడియం కన్నయ్య శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపంలోఉన్న తన 8 ఎకరాల పట్టా భూమిలో గతేడాది జామాయిల్ తోట వేశాడు. ఆ భూమిలో తమకూ వాటా ఉందని అదే గ్రామానికి చెందిన సీతయ్య, అతని కుమారుడు నాగు వచ్చి దౌర్జన్యంగా తోటలోని దాదాపు 300 జామాయిల్ మొక్కలను నరికి వేశారు. రూ.70 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఫిర్యాదుతో ఎస్సై టీవై. రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఇల్లెందు: పూసపల్లి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానులు వి.శ్యామ్, మల్లేష్‌లపై కేసు నమోదు చేసి, వాహనాన్ని స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ బి. సూర్య తెలిపారు.

వరి నార్లు, మామిడి పూతను కాపాడుకోండి





డాక్టర్ కె.రవికుమార్

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో నమోదవుతున్న చలి పంటలకు ప్రతికూలంగా మారుతోంది. ఇందుకు అనుగుణంగా పంటల సంరక్షణలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ సూచించారు. ప్రస్తుతం వరి యాసంగి నారుమడి సాగు చేసే ముందు రెండు గుంటల మడికి రెండు క్వింటాళ్ల సేంద్రియ ఎరువు వేయాలి. అంతేకాక ఎకరం నారుమడిలో కిలో నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను అంటే రెండు కిలోల యూరియా, రెండు కిలోల డీఏపీ, కిలో లేదా కిలోన్నర మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరిలో దున్ని వేసుకోవాలి. రాత్రి పూట నిండుగా నీరు పెట్టి .. మరుసటి రోజు చల్లబడిన నీటిని తొలగించాలి. చలి తీవ్రత పెరిగితే రాత్రి నారుమళ్లపై చువ్వలు, కర్రల సాయంతో పాలిథిన్ షీట్ కప్పాలి. భూమి నుంచి పోషకాలు తీసుకునే అవకాశం ఉండనందున పైపాటుగా 19:19:19 మిశ్రమం 5–10 గ్రా.ను నారు వయస్సు ఆధారంగా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇక పత్తి విషయంలో చలి తగ్గి ఎండ కాసే సమయాన తీసి తేమశాతం 10 వరకు వచ్చేలా ఆరబెట్టాలి. అలాగే, మిరప పూత నుంచి కాయ దశలో ఉన్నందున పైపాటుగా 13–0–45 లేదా 19–19–19 లాంటి పోషకాలు పిచికారీ చేయాలి. పూత రాలుతుంటే ప్లానోఫిక్స్ ఒక మి.లీ.ను 45 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయకుళ్లు తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1మి.లీ. లేదా కాప్టన్+హెక్సాకొనజోల్ రెండు గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడి తోటల్లో పూతను కాపాడుకునేలా 10గ్రా. పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడిలో ఆకుగూడు పురుగు సమస్య పెరుగుతున్నందున క్లోరోపైరిఫాస్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తీగజాతి కూరగాయల పంటల్లో పూత రక్షణకు బోరాన్ 2 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పశుపక్ష్యాదుల సంరక్షణ





రవీంద్రనాథ్ ఠాగూర్

భద్రాచలంఅర్బన్ : చలి కారణంగా మనుషులతో పాటు పశువులు, పక్షులు అవస్థ పడుతుంటాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని యజమానులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఉన్న వనరుల ఆధారంగా పాడి పశువుల పెంపకం, కోళ్ల పరిశ్రమలు కొనసాగుతున్నాయి. పశువులు దాదాపు 5లక్షల వరకు ఉండగా, జీవాల సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక కోళ్ల పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, రఘునాథపాలెం, పెనుబల్లి, సత్తుపల్లి, కల్లూరు, మధిర, వైరా, కూసుమంచి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. చలి కారణంగా పశువులు, ఇతర జీవాల్లో వ్యాధులు సోకే ప్రమాదమున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భద్రాచలం ఇన్‌చార్జ్ ఏడీఏ డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ చేసిన సూచనలు ఇలా ఉన్నాయి. చలికాలంలో పశువులను ఆరుబయట కట్టేయకుండా ప్రత్యేక పాకలు ఏర్పాటు చేయాలి. కింద గడ్డితో బెడ్డింగ్ ఏర్పాటు చేస్తే వాటికి ఇబ్బంది ఉండదు. చల్లటిగాలులు సోకుండా రాత్రి సమయాన పాకల చుట్టూ పరదాలు కట్టాలి. తరచుగా గోరువెచ్చని నీరు అందించాలి. ముఖ్యంగా అప్పుడే పుట్టిన, నెలల వయసున్న దూడలు, జబ్బుతో బాధపడుతున్న పశువులు, పాలు ఇచ్చేవి, ఈనేందుకు సిద్ధంగా ఉన్న వాటి విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. సకాలంలో టీకాలు వేయించాలి. అలాగే కోళ్లను ఆరుబయట కాకుండా షెడ్లు, గూళ్లు, గంపల్లో ఉంచాలి. కొక్కెరమందు, అమ్మతల్లి టీకాలు వేయించాలి. షెడ్లలో చలి నుంచి తట్టుకోవడానికి లైట్లను ఏర్పాటు చేస్తే వేడి వాతావరణం ఉంటుంది. పెంపుడు కుక్కలను కూడా వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. పది రోజులకోసారి స్నానం చేయించాలి. ఈ జాగ్రత్తలన్నీ పాటిస్తే పశువులు, పెంపుడు జంతువులను చలి నుంచి కాపాడుకోవచ్చు.

ఒక్కొక్కరిని కబళిస్తోంది..

అనంతారం గ్రామాన్ని పీడిస్తున్న కిడ్నీ సంబంధ వ్యాధి



కిడ్నీలు చెడిపోయి మంచానికి పరిమితమైన మందెరకల సత్యనారాయణ

- నాలుగేళ్లలో 10 మంది, నెల వ్యవధిలో ఇద్దరు మృతి
- ఇంకా గ్రామంలో పదుల సంఖ్యలోనే బాధితులు
- వ్యాధి నియంత్రణ అవగాహనలో వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యం

కిడ్నీ సంబంధ వ్యాధితో జూలూరుపాడు మండలం అనంతారం గ్రామస్తులు ప్రాణాలొదులుతున్నారు. ఇప్పటికే పలువురు మృత్యువాత పడగా, మరికొందరు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వైద్యం పొందే స్తోమతలేక ఇంకొందరు దీనంగా రోజులు వెళ్లదీస్తున్నారు. 2020 నుంచి డిసెంబర్ 14, 2024 వరకు నాలుగేళ్లలో 10 మంది మృతి చెందారు. గత ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ఐదు నెలల వ్యవధిలో నలుగురు, గడిచిన నెల రోజుల్లో పాలెపు సాహితి(8), పూనెం ప్రేమలత(30) మృతి చెందారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

–జూలూరుపాడు

దయాలసిస్ కోసం ప్రదక్షిణలు

గ్రామంలో సుమారు 50 మంది వరకు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటి సర్వే చేపడితే బాధితుల సంఖ్య 100 వరకు పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్నా, పెద్ద, మహిళలు అందరూ కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారు. కోరం నాగేశ్వరరావు, మందెరకల సత్యనారాయణలు డయాలసిస్ కోసం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుండగా, బుగ్గా రాములు, పాలెపు ముత్తయ్య డబ్బుల్లేక దీనంగా గడుపుతున్నారు. జూలూరుపాడు పీహెచ్‌సీలో డయాలసిస్ సౌకర్యం లేకపోవడంతో బాధితులు కొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాల్సివస్తోంది. అక్కడకు వెళ్లాక రిజిస్ట్రేషన్ కాలేదని, పడకల కొరత ఉందని వైద్యసిబ్బంది తిప్పిపంపుతున్నారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిరావడంతో ఆర్థికభారం పడుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. కొద్దోగొప్పో ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా పలువురు సమస్య బయటకు చెప్పుకునేందుకు జంకుతున్నట్లు తెలుస్తోంది.

గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలే ఎక్కువ..

అనంతారం గ్రామంలో 203 కుటుంబాలు, జనాభా 738 మంది ఉన్నారు. వీరిలో రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్నారు. వ్యాధి ఆదివాసీ గిరిజనుల్లో అధికంగా, గిరిజనేతరుల్లో కొందరిలో ప్రబలుతోంది. గతంలో భేతాళపాడు గ్రామ పంచాయతీలో కిడ్నీవ్యాధి విస్తరించి, కొంత మేర తగ్గుముఖం పట్టగా ప్రస్తుతం అనంతారం గ్రామ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. నాలుగేళ్ల నుంచి ఈ వ్యాధి విస్తరిస్తున్నా నియంత్రణ చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. కాగా తాగునీటి శాంపిల్స్ పరీక్షించామని, ఎలాంటి ఫ్లోరైడ్ సమస్య లేదని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎందువల్ల వస్తోందో..?

తాగునీటిలో భారలోహాలు(సోడియం, ఫ్లోరైడ్, లిథియం, లెడ్, మెగ్నీషియం) సమస్య ఉందా? జన్యు సంబంధం(పుట్టుకతోనే) సమస్య ఉందా? నాటుసారా(గుడుంబా), పొగతాగడం వల్లా? హైడోస్ యాంటీ బయాటిక్ వాడటం వల్ల వస్తుందా? బీపీ (హైపర్‌టెన్షన్), షుగర్ పెరగడం వల్ల వస్తుందా? ఆహారపు అలవాట్లు, నియమాలు పాటించకపోవడమా? ఇతర అనారోగ్య సమస్యల కారణంగా కిడ్నీ వ్యాధి వస్తుందా అనేది తేల్చాల్సి ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ స్పందించి కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని తమ ప్రాణాలు కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొడుకు చనిపోయాడు.. ఇప్పుడు తల్లిదండ్రులకు అదే సమస్య

ఈ చిత్రంలోని దంపతులు పేర్లు కోరం నాగేశ్వరరావు – కౌసల్య. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మూడు నెలల క్రితమే వీరి పెద్ద కుమారుడు నగేష్ కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. రెండేళ్ల నుంచి వీరిద్దరు కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. నాగేశ్వరరావు మాత్రం వారానికి ఒకసారి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆర్థిక స్తోమత లేక కౌసల్య తగిన చికిత్స పొందలేకపోతోంది. అనారోగ్యంతోనే కూలి పనులకు వెళ్తోంది. మాయదారి రోగం మమ్మల్ని ఆగం చేస్తోందని, కాళ్ల వాపులు, కీళ్లు, ఒళ్లు, నడుము నొప్పుల బాధ భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని వేడుకుంటున్నారు.



కిడ్నీవ్యాధితో బాధపడుతున్న కోరం నాగేశ్వరరావు, కౌసల్య దంపతులు

వైద్యానికి డబ్బుల్లేవ్



ఎనిమిదేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాను. కిడ్నీలు దెబ్బతిన్నాయని డాక్టర్లు చెప్పారు. వైద్యానికి, డయాలసిస్ చేయించుకోవడానికి డబ్బుల్లేవు. దీంతో ఇంటి వద్దే కాలం గడుపుతున్నా. నా భార్య కూలి పనులకు వెళ్తేనే ఇల్లు గడుస్తుంది. అప్పుడప్పుడు జూలూరుపాడు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకొని, మందులు తెచ్చుకుంటున్నాను. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలి.

– బుగ్గా రాములు, అనంతారం

అవగాహన పెంపొందిస్తాం



అనంతారంలో ఇటీవల తాగునీటిని పరీక్షించగా ఫ్లోరైడ్ సమస్య లేదని తేలింది. బీపీ, షుగర్ వ్యాధులకు సకాలంలో చికిత్స తీసుకోకపోవడం, పెయిన్ కిల్లర్, హై డోస్ యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు, ట్యాబెట్లు వాడటం వంటి సమస్యల వల్ల కిడ్నీ వ్యాధి బారినపడుతున్నారా? అనే విషయాలపై అధ్యయనం చేయాల్సి ఉంది. ఇప్పటికే బాధితుల రక్త నమూనాలు సేకరించాం. గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– బి.వెంకటేశ్వర్లు, జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

రక్త నమూనాలు సేకరిస్తున్నాం



అనంతారంలో రెండు రోజులుగా ఇంటింటి సర్వే చేపడుతున్నాం. కిడ్నీ బాధితులు, అనుమానితుల నుంచి రక్త నమూనాలను వైద్యసిబ్బంది సేకరిస్తున్నారు. కొత్తగూడె టీ–హబ్‌లో పరీక్షించాక కారణాలు తెలుస్తాయి. కిడ్నీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. బాధితులు మంచి ఆహారం తీసుకోవడంతోపాటు, పరిశుభ్రమైన నీరు తాగాలి. ఆల్కహాల్, గుట్కా, పొగ తాగే అలవాట్లు ఉంటే మానుకోవాలి. కిడ్నీ వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

–ఎల్.భాస్కర్ నాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్

వెయిట్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఇల్లెందు: సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్లను బుధవారం ఇల్లెందులోని సీఈఆర్ క్లబ్‌లో ఎంపిక చేశారు. అండర్–20 బాలబాలికల విభాగాల్లో వీరేంద్ర, శ్రీకాంత్, ఆకాష్, హర్షిత్ దివాకర్, నవీన్, సల్మాన్, పూజిత, పవిత్ర, శృతి, బింధు భార్గవి, సాహితీ, బిందు ప్రియ తదితరులు పోటీలకు ఎంపికయ్యారని వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. మోహన్‌రావు, కౌన్సిలర్ జేకే శ్రీనివాస్, కార్యదర్శి కావటి రమేష్, నజీముద్దీన్, వరికోల శ్రీనివాస్ తెలిపారు. న్యాయనిర్ణేతలుగా చింతా నాగరాజు, షేక్ మహ్మద్, చీమల సుజాత, గురుకులం పీఈటీ రేణుక, మైనార్టీ గురుకులం పీఈటీ నజీముద్దీన్, దుమ్ముగూడెం గురుకులం పీఈటీ చైతన్య వ్యవహరించారు.

బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా జట్టుతో అధికారులు, కోచ్‌లు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడాపోటీల్లో పాల్గొనే జిల్లా బాస్కెట్ బాల్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు సుమారు 120 క్రీడాకారులు హాజరుకాగా, వారిలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైనవారు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పరంధామ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రగతి మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు జాన్సన్ డేవిడ్ మనీ నాయుడు, డీవైఎస్‌ఓ ఆఫీస్ సిబ్బంది తిరుమలరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇసుక లారీ బీభత్సం

చర్ల: ఇసుక లారీలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ ఇంట్లోకి లారీ దూసుకెళ్లింది. తాజాగా బుధవారం అర్ధరాత్రి భద్రాచలం వైపు నుంచి చర్ల వైపు వస్తున్న లారీ రాళ్లగూడెంలో రోడ్డు పక్కన ఉన్న ఓ ట్రాక్టర్ ట్రక్కును ఢీకొట్టింది. అనంతరం పక్కనే ఉన్న కిరాణా దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కిరాణంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రాత్రి పూట ఇసుక లారీలు నడిపే డ్రైవర్లకు సరైన నిద్ర లేకపోవడం, కొందరు డ్రైవర్లు మద్యం తాగి లారీలను నడపడంవల్లనే ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్టీఏ, పోలీసు శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి జీఎం కవితా నాయుడు



మాట్లాడుతున్న జీఎం కవితా నాయుడు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వివిధ డిపార్ట్‌మెంట్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పర్సనల్ విభాగం జీఎం పర్సనల్ కవితా నాయుడు ఆదేశించారు. బుధవారం సింగరేణి కార్యాలయంలో వివిధ యూనియన్లు, అధికారులతో నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. కార్మిక సమస్యలపై చర్చించారు. సెంట్రల్ వర్క్‌షాప్, మెయిన్ వర్క్‌షాపులో ఖాళీగా ఉన్న ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, మేషన్, పెయింటర్, హామర్‌మ్యాన్ పోస్టులను, సెంట్రల్ స్టోర్స్ ట్రాన్స్‌పోర్ట్‌లో క్లర్క్‌లు, జనరల్ మజ్దూర్ ఖాళీలను భర్తీ చేయాలని కార్మిక నాయకులు కోరారు. వివిధ విభాగాలు, కార్యాలయాల్లో ఏసీలు అమర్చాలని, ఎం టైపు క్వార్టర్ల పక్కన పార్క్ నిర్మించాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన మందులు సరఫరా చేయాలని, ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, వార్డ్ సహాయకులు, నర్సులు, ఆయాలు, స్కావెంజర్ల ఖాళీలను భర్తీకి చర్యలు చేపట్టాలని విన్నవించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, బ్రాంచి సెక్రటరీ రమణమూర్తి, అధికారులు బొజ్జ రవి, కే. అజయ్‌కుమార్, ఎం.ఉష, బి.రాజగోపాల్, రాజశేఖర్, హీర్యా పాల్గొన్నారు.

ఆత్మహత్య ఘటనపై డీఎస్పీ విచారణ



మృతుడు రమేష్ కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ చంద్రభాను

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పరమ రమేష్(35) ఈ నెల 11న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ 16వ తేదీన మృతిచెందాడు. చిట్స్ నిర్వాహకుడి వేధింపుల వల్లే మృతి చెందాడని రమేష్ భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీష్ చిట్స్ నిర్వాహకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను బుధవారం విచారణ చేపట్టారు. మృతుడి భార్య, కుటుంబసభ్యుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

8 మందిపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: మద్యం తాగి, మారణాయుధాలతో యువకుడి ఇంటికి వెళ్లి బెదిరించిన వ్యక్తులపై త్రీటౌన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని హనుమాన్‌బస్తీకి చెందిన రౌడీ షీటర్ చిన్న మరో ఏడుగురితో కలిసి హనుమాన్‌బస్తీ ప్రధాన రోడ్డు మెడ్‌ప్లస్ మెడికల్ షాపు పక్కన మంగళవారం రాత్రి 7 గంటల నుంచి మద్యం బాటిళ్లు పట్టుకుని బహిరంగంగా మద్యం తాగారు. ఆ సమయంలో అటువైపు వెళ్లిన వారిపై బెదిరింపులకు పాల్పడ్డారు. మద్యం తాగుతున్నామని పోలీసులకు సమాచారం ఇవ్వండంటూ అరుస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో పాతగొడవల నేపథ్యంలో అదే ఏరియాలోని నదీమ్ ఇంటి వద్దకు వెళ్లి చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డారు. బైక్‌ల హారన్లు మోగించడంతోపాటు కేకలు వేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాగా ఈ తంతగం అంతా సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి బాధితుడు ఎస్పీకి పంపాడు. దీంతో విచారణ నిర్వహించిన పోలీసులు రౌడీ షీటర్ చిన్నతోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ అప్పగింత

టేకులపల్లి: మండలంలోని బర్లగూడెం గ్రామానికి చెందిన పెనక శాంతారావు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులు రికవరీ చేసి బుధవారం తిరిగి అప్పగించారు. బాధితుడు ఈ నెల 12న సెల్‌ఫోన్ పోగొట్టుకుని బోడు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, రికవరీ చేసిన అప్పగించినట్లు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు గ్రామంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతండాకు చెందిన భూక్యా భద్రు(50) భార్య, కుమారుడితో కలిసి ఏడాది కాలంగా గుండ్లరేవు గ్రామంలో కూతురు లలిత ఇంట్లో నివాసం ఉంటున్నారు. భద్రు మద్యానికి బానిసై భార్య, కొడుకుతో గొడవ పడుతుండేవాడు. ఈ నెల 16న భార్య, కొడుకు పొలానికి వెళ్తున్న సమయంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని అడుగగా లేవని చెప్పారు. వారు వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి భద్రు పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో ఉన్నాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- పిల్లలకు తాగించి తానూ పురుగుల మందు తాగిన మహిళ

చర్ల: ఓ మహిళ పిల్లలకు పురుగుల మందు తాగించి తాను కూడా తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన బుధవారం దుమ్ముగూడెం మండలంలో జరిగింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లోనే కలుపుమందు తాగింది. రెండున్నరేళ్ల లోపు వయసున్న తన ఇద్దరు పిల్లలకు కూడా తాగించి వేరే ప్రాంతంలో ఉన్న కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలియజేసింది. దీంతో వారు సమాచారం ఇవ్వగా స్థానికులు సమీపంలోని ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి 108 వాహనం ద్వారా భద్రాచలం తీసుకెళ్లారు. ప్రస్తుతం వీరంతా భద్రాచలంలోని వేర్వేరు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేని దుమ్ముగూడెం సీఐ బి.అశోక్ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనం చోరీకి గురి కాగా, బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అల్లిగూడేనికి చెందిన కొర్సా రవీంద్రబాబు మంగళవారం తన ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన పార్కింగ్ చేసి అశ్వారావుపేటలోని కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న పొలంలో కూలి పనులకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి దుండగులు ద్విచక్రవాహనాన్ని అపహరించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.